www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 30 ఏప్రిల్ 2023

5

ఏలూరు

హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ శనివారం స్థానిక శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలోని అధికారులు బాలురకు అందిస్తున్న వసతులు, ఆహార పదార్థాల గురించి వివరించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పురుషోత్తంకుమార్ మాట్లాడుతూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వసతి గృహంలో ఉన్న బాలురకు ఉచితంగా న్యాయసహాయాన్ని ఎలా పొందొచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో బాలుర వసతి గృహ సూపరింటెండెంట్ మురళీధర్ పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే లారీలు..!

ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లా అధికారులు విఫలం

లారీలు లేక కల్లాల్లోనే ధాన్యపు రాశులు

అకాల వర్షంతో తడిసి ముద్దయిన ధాన్యం

డబ్బులిస్తేనే లారీలు పంపుతామంటున్న కేంద్రాల నిర్వాహకులు

టార్గెట్ పూర్తయిందంటూ సంచులు ఇవ్వని దుస్థితి

చిరిగిన సంచులతో రైతుల అవస్థలు

దెందులూరు మండలం నారాయణపురంలో హడావుడిగా ధాన్యం మాసూళ్లు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నా పేరు కూనా ముకుందరావు, కొవ్వలి గ్రామం. ఎకరం భూమిలో ధాన్యం మాసూలు చేసి బస్తాల్లో నింపి కొవ్వలి సొసైటీ వద్దకు చేర్చాను. ఇప్పటికి నాలుగు రోజులైంది. లారీలు రావడం లేదని ధాన్యం ఎత్తు లేదు. వర్షాలకు నానా యాతన పడుతున్నాం. ముందుగా లారీ కిరాయి నిమిత్తం రూ.2,100 ఇస్తేనే ధాన్యం తీసుకెళ్తామంటూ కొనుగోలు కేంద్రాల్లో పని చేసే సిబ్బంది చెబుతున్నారు. ఇదేం దారుణమో అర్థం కావడం లేదు'.

'కొవ్వలి గ్రామానికి చెందిన పొన్నాడ పారినాయుడు 16 ఎకరాల్లో వరి సాగు చేశారు. సంచుల్లో ధాన్యం పట్టి 250 సారలు ఉన్నాయి. లారీలు రావడం లేదని ధాన్యం తీసుకెళ్లలేదు. ముందుగా టన్నుకు రూ.350 చొప్పన కిరాయి డబ్బులిస్తేనే లారీలు పెడతామంటున్న పరిస్థితి ఉంది. ఇంకా ఐదెకరాల ధాన్యం కల్లాల్లోనే ఉంది. శనివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. గ్రామంలో పండిన పంటలో 50 శాతం ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. ఇచ్చిన సంచుల్లో సగం చిరిగిపోయి ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.'

పైన పేర్కొన్న రైతులు ముకుందరావు, పారినాయుడే కాదు. ఏలూరు జిల్లాలోని వేలాది మంది రైతుల పరిస్థితీ ఇదే. ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లా పౌరసరఫరాల శాఖ పూర్తిగా విఫలం కావడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. లారీలు సకాలంలో పంపడంలో అధికారులు పూర్తిగా చేతులెత్తేశారు. దీంతో ముందుగా డబ్బులిస్తే లారీలు పెడతామని కొనుగోలు కేంద్రాల్లో పని చేసే సిబ్బంది చెప్పడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఏలూరు జిల్లావ్యాప్తంగా రబీలో 79 వేల ఎకరాల్లో వరిసాగు సాగింది. 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దీనిలో రెండు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని టార్గెట్ నిర్ణయించారు. ధాన్యం కొనుగోలు ప్రారంభం నుంచి అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. లారీలు లేక కల్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో అకాల వర్షాలతో రైతులు విలవిల్లాడుతున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయపోవడంతో పండిన పంట కల్లాల్లోనే దర్శనమిస్తోంది. మాసూలు చేసిన ధాన్యంలో 50 శాతం పంట ఇప్పటికీ కల్లాల్లోనే ఉండిపోయింది. శనివారం వచ్చి పడిన అకాల వర్షంతో దెందులూరు వంటి మండలాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులకు ఏంచేయాలో తెలియని దుస్థితి నెలకొంది. పంటను తరలించేందుకు లారీల ఏర్పాటులో జిల్లా అధికార యంత్రాంగం చేతులెత్తేయడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ముందస్తుగా రైతులు డబ్బులిస్తే మాత్రం లారీలు వెంటనే వచ్చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో లారీ కిరాయి నిమిత్తం రైతులకు రూ.13 వేల నుంచి రూ.20 వేల వరకూ ఖర్చవుతోంది. లారీలు సమకూర్చాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారు. వచ్చిన ఒకటి, రెండు లారీలు కూడా అధికార పార్టీ అండ ఉన్నవారికే వెళ్లిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. లారీలకు ముందస్తుగా డబ్బు కట్టడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. ఖరీఫ్‌లోనూ ఏలూరు జిల్లావ్యాప్తంగా రైతులు ధాన్యం విక్రయించేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. రబీలోనూ అదే పరిస్థితి నెలకొంది.

సంచుల్లేవ్..

పండిన పంటలో సగం ధాన్యం కొనుగోలు చేయాలని మాత్రమే టార్గెట్ నిర్ణయించారు. పలు కొనుగోలు కేంద్రాల్లో టార్గెట్ పూర్తయిపోయింది. దీంతో సంచులు నిలిపివేశారు. ఇంకా ఆ కొనుగోలు కేంద్రం పరిధిలో సగం ధాన్యం ఉండిపోయింది. సంచుల్లేక రైతులు నానాఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన సంచుల్లో సగం చినిగిపోయి ఉండటంతో ధాన్యం పట్టేందుకు నానావస్థలు పడుతున్నారు. పండిన పంటను వర్షాల బారి నుంచి కాపాడుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు అనుభవిస్తున్నారు. వర్షాలకు తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీల ఏర్పాటులో అధికారులు ఎందుకు విఫలమవుతున్నారో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది.

ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అమరావతి జెఎసి ఆధ్వర్యాన

సచివాలయ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో శనివారం మలి దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా 'గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు' నినాదంతో స్థానిక కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా శాఖ ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాలు, అందులో పని చేసే ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని, వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో ఉన్న వీరు కేవలం ప్రభుత్వ ఉద్యోగమనే ఆశతో చేరినప్పటికీ ప్రభుత్వం వీరి సమస్యలపై అలసత్వం వహిస్తూ కాలయాపన చేస్తుందన్నారు. మొదటి దశలో గ్రామ వార్డు సచివాలయాల్లో ఉద్యోగం సంపాధించిన ఉద్యోగులకు తొమ్మిది నెలలు, అలాగే రెండో దశలో చేరిన వారికి ఐదు నెలలు ప్రభుత్వం బకాయిలు నేటికీ చెల్లించలేదని తెలిపారు. ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించి సాధారణ బదిలీలు చేపట్టి బదిలీలలో స్పౌజ్ కేసులకు అధిక ప్రాధాన్యత కల్పించి వారికి న్యాయం చేయాలని కోరారు. రూరల్, అర్బన్ ఏరియా ప్రాతిపదికన ఉద్యోగుల సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌ను డిస్కంతో సంబంధం లేకుండా ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు జాబ్ ఛార్ట్ ఏర్పాటుచేసి ఎపి జిఎల్ఐ బాండ్లను, ఇహెచ్ఎస్ కార్డులను వెంటనే అందజేయాలని కోరారు. అలాగే గ్రేడ్ టు విఆర్ఒలకు ప్రొబిషన్ వెంటనే డిక్లేర్ చేయాలన్నారు. సిపిటి పరీక్షల వల్ల ప్రొఫెషన్ డిక్లేర్ కానీ గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-2 విఆర్ఒలకు సిపిటి పరీక్షలు నిర్వహించి ప్రొబిషన్ డిక్లరేషన్‌కు అర్హత కల్పించాలన్నారు. రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎపి జెఎసి అమరావతి పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఎపి జెఎసి అమరావతి చేపట్టిన ఆందోళనకు రాష్ట్రంలోని అన్ని ట్రేడ్ యూనియన్లు మద్దతు తెలుపుతున్నాయని, ఉద్యోగులందరూ సమిష్టిగా ఉద్యమంలో పాల్గొని సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ బి.రాంబాబు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్ కుమార్, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, జెఎసి రాష్ట్ర నాయకులు హరినాథ్, ఎపి జెఎసి అమరావతి కో ఛైర్మన్ సిహెచ్.వర్మ, ట్రేడ్ యూనియన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రసాద్, వివిధ ఉద్యోగ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలపై పరదాలు కప్పుతున్న రైతులు

అకాల వర్షం.. అన్నదాతల్లో కలవరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలో పలుచోట్ల కురిసిన అకాల వర్షానికి వరి రైతులు అవస్థలు పడ్డారు. లక్కవరం, దేవులపల్లి, పంగిడి గూడెం పెరంపేట తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం నుండి మబ్బులు కమ్ముకున్నాయి. ఈ క్రమంలో ఈదురు గాలులు తోడై భారీ వర్షం కురిసింది. కొందరు రైతులు ముందుగా అప్రమత్తమై పొలాల్లో ధాన్యంపై బరకాలు కప్పారు. అయినప్పటికీ ఎక్కువ ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. పంట చేతికందే సమయంలో అకాల వర్షం నష్టం కలిగించిందని వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోసి వారం రోజులైనా ఇప్పటివరకూ బంటాను గానీ, లారీలను గానీ పంపక పోవడంతో పొలాల్లోనే వరిపంట తడిసిపోయిందని పలువురు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారంరోజులుగా రైతు భరోసా కేంద్రాల చుట్టు తిరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు సోడే శ్రీనివాసరావు, వెంకటరమణ కోరుతున్నారు.

జీలుగుమిల్లి:వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం మండలంవ్యాప్తంగా అకస్మాత్తుగా మబ్బులతో కూడిన ఈదురు గాలులు వీయడంతో మొక్కజొన్న, వేరుశనగ, రైతులు పంటను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో రైతులు కంగారుపడుతున్నారు.

అలాగే జిల్లాకేంద్రం ఏలూరులో భారీవర్షం కురిసింది. ఆర్ఆర్‌పేట, శ్రీనివాసథియేటర్ రోడ్లు నీటమునిగాయి. జనజీవనం స్తంభించింది. పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఉంగుటూరు, నూజివీడు, భీమడోలు తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

ఐఐటి, జెఇఇ మెయిన్స్‌లో వికాస్ విద్యార్థుల హవా

జంగారెడ్డిగూడెం:ఐఐటి, జెఇఇ-2023 మెయిన్స్ ఫలితాల్లో వికాస్ విద్యా సంస్థలు విజయదుందుభి మోగించాయని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ వి.జగన్ తెలిపారు. శనివారం వికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఐటి, జెఇఇ మెయిన్స్‌లో వికాస్ విద్యార్థులు సాధించిన ఫలితాలను వెల్లడించారు. 42 మందిలో 26 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. మెట్ట ప్రాంతంలో 65 శాతం విద్యార్థులు ఐఐటి జెఇఇ ర్యాంకులు సాధించిన ఘనత వికాస్ విద్యా సంస్థలకు దక్కిందని తెలిపారు. మెయిన్స్ ఆలిండియా స్థాయిలో ఎడ్లపల్లి చందు 12,373, కె.దివ్యరోజా 23,474, ఎన్.గురు గౌతమ్ రెడ్డి 23,572, సిహెచ్.కుశ్వంత 25,140, డి.జయశ్రీ 39652, ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ వి.సౌజన్య లక్ష్మి, డీన్ కె.సత్యనారాయణ, ఎఏ ఎన్ఎం.రావు, ప్రిన్సిపల్ కె.కిషోర్, సిహెచ్.కిషోర్, అధ్యాపకులు, చిట్టిబాబు, ప్రేమ్, ధనరాజు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన : ఎలిజా

జంగారెడ్డిగూడెం:జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వచ్చిందని చింతలపూడి ఎంఎల్ఎ విఆర్.ఎలిజా అన్నారు. శనివారం కార్యక్రమం ముగింపు సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును నేరుగా ప్రజల ఇళ్లకు వెళ్లి పరిశీలించామన్నారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యావాదాలు తెలిపారు.

ఐక్యతతోనే అభివృద్ధి : డిఎన్ఆర్

కైకలూరు:సభ్యుల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు(డిఎన్ఆర్) అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో శ్యామల సౌండ్స్ అధినేత, యూనియన్ అధ్యక్షులు బొప్పన శివకుమార్ అధ్యక్షతన నియోజకవర్గ సౌండ్స్, లైటింగ్, షామియాన, డెకరేషన్ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంపిపి అడవి కృష్ణమోహన్, సంఘ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలులో సమస్యల పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - ఏలూరు రూరల్

ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు హెచ్చరించారు. శనివారం ఏలూరు మండలంలోని మల్కాపురంలో రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు పర్యటించారు. ధాన్యం కల్లాల వద్ద నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. రైస్ మిల్లులు వద్ద అన్‌లోడ్ కాక లారీలు, ట్రాక్టర్లు నిలిచిపోవడంతో రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎం.హరిబాబు మాట్లాడుతూ నూకశాతం పేరుతో రైతులు, కౌలు రైతుల నుండి డబ్బులు వసూలు చేయడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ధాన్యం కొనుగోలులో అధికారులకు తగిన ప్రణాళికలు లేకపోవడం వల్ల ఒకే మిల్లుకు ఎక్కువ వాహనాలు పంపడంతో ధాన్యం అన్‌లోడ్ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లక్ష్యం పూర్తయిందనే పేరుతో రైతులకు గోనె సంచులు అందించడం లేదన్నారు. ధాన్యం రవాణాకు తగిన లారీలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఎక్కడ ధాన్యం అక్కడే ఉండిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న నాయకులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నూక శాతం పేరుతో రైతుల నుండి డబ్బు వసూలు దారుణం

లక్ష్యం పెంచి రైతులకు గోనె సంచులు ఇవ్వాలి

కల్లాల నుండే ధాన్యం కొనుగోలు చేయాలి

రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - దెందులూరు

కౌలు రైతుల, రైతుల నుండి కల్లాల వద్ద నుండే ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం, ఆలస్యం వల్ల అకాల వర్షానికి తడిసిన ధాన్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించి కొనుగోలు చేయాలని ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని కొవ్వలి, దోసపాడు, పోతునూరు, ఉండ్రాజవరం, సత్యనారాయపురం గ్రామాల్లో రైతుసంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు శనివారం పర్యటించి ధాన్యం కొనుగోలు సమస్యలను రైతులు, కౌలు రైతులను అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణపురంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం కల్లాల వద్ద రైతులు, కౌలురైతులతో ఆందోళన చేపట్టారు. ధాన్యం రాసలపై పడిన వర్షపు నీటిని చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎం.హరిబాబు, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో గోనె సంచులు ఇవ్వకుండా, రవాణాకు లారీలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరించడంతో కల్లాల్లో ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్మి వర్షం కురవడంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడ్డారని చెప్పారు. నూక శాతం పేరుతో రైతులు, కౌలు రైతుల నుండి మిల్లర్లు డబ్బులు వసూలు చేయడం దారుణమని విమర్శించారు. పంట అమ్ముకోవడానికి పెట్టుబడి పెట్టాల్సిరావడంతో కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌బికె వద్ద తేమశాతం లెక్కించే సమయంలోనే నూక శాతం కూడా నిర్ధారణ చేసి ఆ మేరకే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. మిల్లుల వద్దకు ధాన్యం వెళ్ళిన తర్వాత నూక శాతం ఏ విధంగా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కొనుగోలు నిబంధన ప్రకారం రైతు భరోసా కేంద్రానికి నిర్దేశించిన వే బ్రిడ్జి కాటా అనంతరం ట్రక్ షీట్ జనరేట్ చేసిన తర్వాత ఆ ధాన్యాన్ని మిల్లులకు తరలించే బాధ్యత ఆర్‌బికె వారిదేనన్నారు. నూక శాతం పేరుతో రైతులను మిల్లులు వద్దకు పంపడం రాష్ట్ర ప్రభుత్వ నిబంధనకు విరుద్ధమన్నారు. కొనుగోలు కేంద్రానికి నిర్ధేశించిన లక్ష్యం పూర్తయిందనే పేరుతో రైతులకు గోనె సంచులు ఇవ్వడం లేదన్నారు. కొనుగోలు లక్ష్యం పెంచి గోనె సంచులు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ధాన్యం రవాణాకు సరిపడా లారీలను, ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సున్నా వెంకటరావు, కొల్లి విజయభాస్కర్‌రెడ్డి, ఎస్.సాయి, వి.రామకృష్ణ, ఎల్.శ్రీనివాసరావు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



తాడువాయి పంచాయతీ చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్యను కోరారు. శనివారం చల్లావారిగూడెం అర్అండ్అర్ కాలనీ ఇళ్ల నిర్మాణాలను ప్రవీణ్ ఆదిత్య పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు తమకు ఆర్అండ్ఆర్ నష్ట పరిహారం చెల్లించలేదని ఆయనకు తెలిపారు. అలాగే కాలనీలో సరైన వసతులు లేవని తెలిపారు. నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కాలనీలో తాగునీటి సౌకర్యం సక్రమంగా లేదని తెలిపారు. విదుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని వాపోయారు. కాలనీలో ఇళ్ల మధ్య మట్టి లెవిల్ చేయాలని, వీధిలైట్లు, చేతి పంపులు, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్వాసితులు కోరారు. దీనిపై స్పందించిన ప్రవీణ్ ఆదిత్య నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వేలేరుపాడు ఎంపిపి వి.లక్ష్మీదేవి, వైసిపి యూత్ అధ్యక్షులు బద్దె ప్రేమ్‌కుమార్, కాలనీ అధ్యక్షులు గిల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెరుమాళ్ నరసింహారావు, బద్దె కృష్ణ, నజీర్, బండి రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విసి దంపతుల కారుకు ప్రమాదం

నిద్రమత్తులో చెట్టును ఢీకొట్టిన డ్రైవర్

భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ దంపతుల కారు శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో భార్య అక్కడికక్కడే మృతిచెందింది. విసి, డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. ఉంగుటూరు మండలం చేబ్రోలు వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన తోలేటి జానకీరామ్ పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి (విసి)గా పనిచేస్తున్నారు. ఆయన భార్య ఉషశ్రీ(54)తో కలిసి తాడేపల్లిగూడెంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కడప జిల్లా అనంతరాజుపేటలో శుక్రవారం జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమానికి భార్యభర్తలిద్దరూ కారులో డ్రైవర్‌ను తీసుకుని బయలుదేరారు. అక్కడ కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం తాడేపల్లిగూడేనికి తిరిగి పయనమయ్యారు. అర్ధరాత్రి సమయంలో చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన చెట్టును డ్రైవర్ అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఉషశ్రీ, జానకీరామ్, కారుడ్రైవర్ శ్రీనుప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని కారులో నుంచి బయటకు తీసి 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉషశ్రీ పరిస్థితి విషమంగా ఉండటతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతిచెందారు. జానకీరామ్, అతని కారు డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోస్టుమార్టం అనంతరం ఉషశ్రీ మృతదేహాన్ని స్వస్థలం గుంటూరుకు తరలించారు. ఈ ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు



ఉషశ్రీ(ఫైల్‌ఫొటో)

వచ్చే నెలలో కుమారుడి వివాహం.. అంతలోనే విషాదం

వైస్‌ఛాన్సలర్ జానకీరామ్ కుమారుడి వివాహం వచ్చేనెలలో జరగనుంది. ఈ తరుణంలో అనుకోని ప్రమాదం ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పలువురు మంత్రులు, అధికారులు విసిని ఆసుపత్రిలో పరామర్శించారు.

మేడే వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా వచ్చేనెల ఒకటో తేదీన సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో 45 పారిశ్రామిక, కార్మిక కేంద్రాల్లో మేడే జెండాలు ఎగురవేస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సిఐటియు నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా పైన పేర్కొన్న డిమాండ్లపై పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి కార్మికవర్గాన్ని సన్నద్ధం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవం ఎనిమిది గంటల పని విధానం కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రారంభమైందని, కానీ నేటి పాలకులు దానికి భిన్నమైన విధానాలు అమలుచేస్తున్నారని ఆయన విమర్శించారు. సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగరంలో మేడే కార్యక్రమాల ప్లాన్‌ను నగర కార్యదర్శి వి.సాయిబాబు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో సిఐటియు నగర ఆఫీస్ బేరర్లు ఎ.జాన్‌బాబు, జె.గోపి, కారు దుర్గారావు, లావేటి కృష్ణారావు, పి.వెంకటరమణ, కె.రజిని, ఎ.ఉషారాణి, ఎ.ఇందిరాదేవి, యర్రా రాంబాబు, వివిఎన్.ప్రసాద్, సీతయ్య, పి.శ్రీరాంప్రసాద్ పాల్గొన్నారు. మేడే రోజున ఉదయం ఐదు గంటల నుండి ఎనిమిది గంటల వరకూ పారిశ్రామిక, కార్మిక కేంద్రాలు, కూడళ్లలో జెండా ఆవిష్కరణలు జరుపుతామని, ఉదయం తొమ్మిది గంటలకు ఆర్ఆర్.పేట పార్కు వద్ద నుండి కార్మిక ప్రదర్శన ప్రారంభమై ఉదయం పది గంటలకు పవర్‌పేట సిఐటియు ఆఫీస్‌కు చేరుకుని అక్కడ సభ నిర్వహిస్తామని వి.సాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు అనుబంధ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు ఏలూరు పాతబస్టాండ్ వద్ద నుండి కొత్తబస్టాండ్ వరకూ ఆటో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సమావేశం తెలిపింది.

ముసునూరు జెడ్‌పిటిసికి డాక్టరేట్

ప్రజాశక్తి - ముసునూరు

కర్ణాటక రాష్ట్రంలోని ఆసియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ నిర్వహించిన స్నాతకోత్సవంలో ముసునూరు జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్‌కు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఆయన 15 సంవత్సరాలుగా విద్యా, సామాజిక రంగాల్లో ఎంతో సేవాచేశారు. ఈ సేవలకుగాను ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, శ్రేయోభిలాషులు, మిత్రులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ పనులకు గ్రామస్థాయి అధికారులు పంచాయతీ తీర్మానం ఇవ్వకపోవడంతో గ్రామ సచివాలయం వద్ద గ్రామస్తులు ఆందోళన చేశారు. మండలంలోని సూరేపల్లి గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి జంగం యోహాన్‌ను గ్రామస్తులు నిలదీశారు. ఉపాధి హామీ చట్టంలో పని చేసే గ్రామ స్థాయి సిబ్బంది ఉద్యోగి రాజకీయ కారణాలతో తీసివేయడంతో మొదలైన గొడవ చివరికి గ్రామస్తులకు ఉపాధి హామీ పనులు లేకుండా చేసే పరిస్థితికి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత ద్వేషంతో తీర్మానం ఇవ్వకపోవడంతో ఉపాధి హామీ పనులు లేవని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయి ఉపాధి హామీ సిబ్బంది పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

'ప్రజా సంక్షేమమే జగన్ లక్ష్యం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజాసంక్షేమమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలో జగనన్న పరిపాలన సాగుతోందని కేతవరం సర్పంచి తడికలపూడి శివ మాధవి కిషోర్‌కుమార్ అన్నారు. మండలంలోని కేతవరం గ్రామ పంచాయతీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరిస్తూ కుటుంబ సభ్యుల అనుమతితో సిఎం జగన్ స్టిక్కర్లను ఇంటి గోడలకు, తలుపులకు అంటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులకు అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బొడ్డపాటి రాంబాబు, బర్రె రవిబాబు, కొమ్ము సుబ్బమ్మ, పరసా రాజకుమార్, కొమ్ము శ్రీను, బర్రె లక్ష్మీనారాయణ, నందిపాం ప్రసన్న పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - కలిదిండి

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.త్రినాథ్ తెలిపారు. తాడేపల్లి ఇంటర్మీడియట్ విద్యామండలి కమిషనర్ ఆదేశాలతో మే ఒకటి నుంచి సప్లిమెంటరీ పరీక్షల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే తరగతులను ఫెయిల్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



భీమడోలు : అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - భీమడోలు

ఐసిడిఎస్ భీమడోలు సెక్టార్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినట్లు సూపర్‌వైజర్ షహనాజ్ బేగం తెలిపారు. ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఐదుగురికి తక్కువ కాకుండా అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకున్న పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశానికి అర్హత పొందారని తెలిపారు. వీరందరూ సెక్టార్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చేరనున్నారని తెలిపారు.

ముసునూరు : మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కెజీ, యుకెజీ చదివిన ఐదేళ్ల లోపు విద్యార్థులు ఒకటో తరగతిలోకి పంపుతున్నట్లు ఉపాధ్యాయురాలు పి.రాజకుమారి తెలిపారు.

విజయవంతంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా మండలంలో 80 శాతం కుటుంబాలకు చెందిన సర్వే పూర్తయిందని వైసిపి మండల కన్వీనర్ ఎస్‌విపిఆర్‌కె శ్రీనురాజు తెలిపారు. ఈ నెల ఏడో తేదీ నుంచి 29 వరకు నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా టి.నరసాపురంలోని వైసిపి మండల నాయకులు సొసైటీ చైర్ పర్సన్ దేవరపల్లి ముత్యాలమ్మ ఇంటివద్ద శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీనురాజు మాట్లాడుతూ మండలంలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రజలందరూ పెద్ద ఎత్తున మద్దతు పలికారన్నారు. మండలంలోని గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు సర్వే ద్వారా 80 శాతం మంది కుటుంబాలను సందర్శించారని మిగిలిన 20శాతం కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు తీవ్ర గాయాలపాలైన ఘటన ముదినేపల్లిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన వృద్ధురాలు పోలీ సత్తెమ్మ ముదినేపల్లిలో ఉన్న తన ఇద్దరు కుమార్తెలను చూసేందుకు వస్తూ గురజ రోడ్డులోని జిన్నూరు రైస్ మిల్లు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైంది. గురజ గ్రామానికి చెందిన మాలమహానాడు కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసరావు అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధురాలిని చూసి వెంటనే 108కి, వృద్ధురాలి కుమార్తెలకు సమాచారం అందించారు. వృద్ధురాలి కుమార్తెలు 108 వాహనంలో క్షతగాత్రురాలిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని ఎంఎన్ పాలెంకి చెందిన చోడవరపు ఉమారాణి శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె భర్త చోడవరపు నాగ వెంకట రంగారావు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మేడే కార్యక్రమాలను జయప్రదం చేయాలి

భీమడోలులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - భీమడోలు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం నిర్వహించే మేడే కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. పూళ్ల గ్రామంలోని రైస్‌మిల్లు వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మేడే వాల్‌పోస్టర్‌ను రైస్‌మిల్లు కార్మికులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో పూళ్ల, గుండుగొలను, భీమడోలు గ్రామాల్లో సిఐటియు పతాకాన్ని ఎగరవేస్తామన్నారు. ఉదయం పది గంటలకు భీమడోలు జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, అనుబంధ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆగిరిపల్లి : ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే వేడుకలకు మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల్లోని సిఐటియు స్థూపాలు రంగులతో ముస్తాబు అవుతున్నాయి. ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో ఉన్న అమరవీరుల స్థూపం, సుందరయ్య భవనం వద్ద ఉన్న సిఐటియు స్థూపం, కొండ కాలనీ చిన్న ఆగిరిపల్లి, ఈదులగూడెం, గొల్లగూడెం, కుశలవ ఇంటర్నేషనల్ కంపెనీ, కొమ్ముూరు, వడ్లమాను గ్రామాల్లో గల స్థూపాలు మేడే వేడుకలకు సిద్ధం అవుతున్నాయి. సిఐటియు, పలు ప్రజాసంఘాల నాయకులు రాజులపాటి చంటి, చాకిరి శివనాగరాజు, సత్తు కోటేశ్వరరావు, ఏపూరి రవీంద్ర పర్యవేక్షణలో ఈ స్థూపాలు ముస్తాబు అవుతున్నాయి.

ఆగిరిపల్లిలో ముస్తాబవుతున్న అమరవీరుల స్థూపం

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరులో ఎన్ఆర్ఐ విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఎన్ఆర్ఐ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల సిఇఒ వి.తులసీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఎ.మణిదీప్ 99.28 శాతం, టి.సాయికార్తీక్ 97.15, జె.కమల 96.76, పి.మామాబ్ 96.58, డి.నితీష్‌సాయి 96.41, సిహెచ్.యశ్వంత్‌మణి 93.49, డి.భరత్ 90.41 శాతం0తో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనపరిచారని తెలిపారు. ఈ అద్భుత ప్రతిభను కనపరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఈ విజయానికి కారకులైన సీనియర్ అధ్యాపకు లను అభినందించారు. తమ కళాశాల నుంచి 57 మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ వి.కనక రత్నం, ఇ.మురళీ కృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్య నారాయణ, సిహెచ్.శివకుమార్, కళాశాల ఎఒలు కె.మల్లికార్జునరావు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు, వి.రాట్నాలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఐఐటి జెఇఇ 2023 మెయిన్స్ ఫలితాల్లో స్థానిక విద్యావికాస్ విద్యార్థులు ర్యాంకుల ప్రభంజనం సృష్టించారని డైరెక్టర్ పి.సతీష్‌చంద్, కరస్పాండెంట్ వి.శ్రీనివాస్ తెలిపారు. ఐఐటి జెఇఇ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పి.సతీష్‌చంద్, వి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యావికాస్ విద్యా సంస్థల విద్యార్థి జె.జస్వంత్ ఫణిప్రసాద్ ఆల్ ఇండియ స్థాయిలో 322వ ర్యాంకు సాధించారని తెలిపారు. కె.రుద్రప్రతాప్ 356, కె.అంజన 7010, కె.అఖిల 8205, ఎం.రాకేశ్‌దొర 12373, కె.జాన్ దేవదాస్ 14217, ఎం.చంద్రమౌళి శ్రీకర్ 14436, ఎం.పీతాంబరి 19237 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో విద్యా వికాస్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో విద్యావికాస్ విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

స్వపక్షంలోనే విపక్షం..!

పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నారంటూ అధికార పార్టీ సర్పంచులు ఆవేదన
ఆర్అండ్‌బి రోడ్ల అధ్వానంపై ప్రజాప్రతినిధులు ధ్వజం
వాడీవేడీగా ఉంగుటూరు సర్వసభ్య సమావేశం



ఉంగుటూరు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడీగా జరిగింది. గ్రామాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయని, పంచాయతీల్లో చిల్లు గవ్వలేదని, జనాలు విసిగెత్తి ఉన్నారని, గడపగడపకూ కార్యక్రమానికి వచ్చే ఎంఎల్ఎను, ఇతర ప్రజాప్రతినిధులను, అధికారులను సైతం నిలదీసే అవకాశం ఉందని, ఇప్పటికైనా నిధులు ఇవ్వండంటూ వెల్లమిల్లి సర్పంచి వస్కాకుమార్‌రాజా కోరారు. రావులపర్రు-ఉంగుటూరు ఆర్అండ్‌బి రహదారి పత్తేపురం పంట కాలువపై వంతెన పడిపోయి నాలుగేళ్లు అయింది. ధాన్యం లారీలు, విద్యార్థుల స్కూల్ బస్సులు చుట్టూ ఎనిమిది కిలోమీటర్ల పైగా తిరిగి వెళ్లాల్సి వస్తోందని, ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవడంలేదని దొంతవరం, కాగుపాడు, రావులపర్రు గ్రామాల సర్పంచులు కంభంపాటి సత్యవతి, కడియాల సుదేష్ణ, పైడి వెంకట రమణ అసహనం వ్యక్తం చేశారు. తాను కొత్తగా వచ్చానని, ప్రతిపాదనలు, వివరాలు ఎంఎల్‌కు ఇచ్చామని ఆర్అండ్‌బి అధికారి సమాధానంతో సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారుల ఉదాసీన వైఖరి సరికాదని ఇఒపిఆర్‌డి షంషుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, నాగేంద్ర అన్నారు. ఆక్రమణలకు అడ్డువేయడంలో అధికారుల అలసత్వం వీడాలన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ తీగలు తగిలేలా ఉన్న ప్రాంతాలను సర్పంచులు గుర్తించి సమాచారం ఇస్తే వాటిని మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తామని హౌసింగ్ ఎఇ సురేష్ తెలిపారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సమావేశానికి సకాలంలో వస్తే అధికారులు ఆలస్యంగా రావడం సరికాదన్నారు. జెడ్‌పి నిధు లతో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామని జెడ్‌పిటిసి సభ్యు లు కొరిపల్లి జయలక్ష్మి అన్నారు. నాచుగుంటలో డ్రెయినేజీ సమస్యల నివారణకు నిధులు ఇవ్వాలని సర్పంచి ఏలేటి సునీత కోరారు. అనంతరం ఎంపిటిసి ఛాంబర్ అధ్యక్షునిగా ఇటీవల ఎంపికైన బండారు నాగ వెంకట సత్యనారాయణకు చిరు సత్కారం చేశారు. ఈ సమావేశంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమాతి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, వైస్ ఎంపిపి సింగిరెడ్డి సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పోతురాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా సర్వసభ్య సమావేశం

బుట్టాయగూడెం : అధికారులు లేకుండా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తే సమ స్యల పై ఎలా చర్చిస్తారని, ఎలా పరిష్కారమవుతాయని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రజా ప్రతిప్రతినిధులు అలివేరు సర్పంచి కె.లక్ష్మి, కొరసావారిగూడెం సర్పంచి కొర్సా గంగ రాజు, ముంజులూరు సర్పంచి కె.ముక్కారెడ్డి, పులి రామన్న గూడెం ఎంపిటిసి సభ్యులు మడకం వెంకటలక్ష్మి అన్నారు. శనివారం నిర్వహించిన బుట్టాయగూడెం సర్వ స భ్య సమావేశం అలంకారప్రాయంగా నిర్వహించారన్నారు. తమ పంచాయతీల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని ఆయా పంచాయతీల సర్పంచులు చెప్పారు. విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉండి వైర్లు కిందకి వేలాడుతూ ప్రమాదకర స్థితిలో ఉన్నాయన్నారు. నూతన స్తంభాలే వేయడంతో పా టు మరమ్మతులు చేయించాలన్నారు. గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టడంలేదన్నారు. గ్రామాల్లో మం చినీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరాయని, మరమ్మత ులు చేయించాలని, నూతన ట్యాంకులను నిర్మించాలని కోరారు. గ్రామ పంచాయతీలో సమస్యలు పరిష్కరిం చేందుకు నిర్వ హించే సమావేశంలో కింది స్థాయి అధికారులు మాత్రమే హాజరవుతున్నారని, ఉన్నతాధికారులు హాజర వ్వడంలేదని చెప్పారు. రానున్న సమావేశానికి అధికారులం దరూ హాజరై గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు టాస్క్‌ఫోర్స్ కమిటీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం ప్రభుత్వం గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసిందని సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ టిఎన్.స్నేహన్ చెప్పారు. ఐదుగురు సభ్యుల కమిటీ ఐదు ప్రధాన లక్ష్యాల సాధనపై ప్రత్యేక శ్రద్ధ సారించటానికి గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి టీం లీడర్‌గా వ్యవహరించాలని ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. శనివారం దొరమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ఎ.నాగవెంకట్‌ప్రవీణ్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ కమిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహన్ మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అందించే లక్ష్యసాధన కోసం గర్భిణులు, బాలింతలు, యుక్త వయసు బాలల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. యుక్త వయసు బాలికలకు క్రమం తప్పకుండా రక్తశాతం తెలుసుకునే పరీక్షలు జరపాలన్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులు మెరుగు పర్చటం, అనారోగ్య బాధితులకు సేవలు చేయటం వంటి పనులు టాస్క్‌ఫోర్స్ కమిటీ చూడాలన్నారు. అందుకోసం ఈ కమిటీ ప్రతి నెలా సమావేశమై సమీక్షించాలని సూచించారు. అనంతరం దొరమామిడి గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయంలో బాలల కోసం ప్రత్యేక రిజిష్టర్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ ప్రవీణ్, నాగరత్నం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎంపిహెచ్ఎస్ ఎస్.వెంకాయమ్మ, గ్రామ కార్యదర్శి ఎం.బుజ్జమ్మ, సిహెచ్ఒలు ఎస్.మీరాకుమారి, సాయి ప్రణదిని, ఎస్.బేబి, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీతో స్నేహన్



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కె.రాంబాబు

వంగవీటి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు వంగవీటి మోహన్‌రంగా అని డిసిసిబి మాజీ ఛైర్మన్ కె.రాంబాబు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో దాత సాధనాల నరసింహారావు నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగా సేవలు చిరస్మరణీయమన్నారు. రంగా భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు అన్ని వర్గాల ప్రజలు కొనసాగించడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొత్త ప్రకాష్‌బాబు, తోట లక్ష్మీనారాయణ, కె.కృష్ణస్వరూప్, మధ్యాహ్నపు చినపెంటారావు, కుంబాల సత్యనారాయణ, శ్రీను, జంగాల సత్యనారాయణ, పౌజుల ఉదయ్, కలపర్తి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పల్లెర్లమూడి గ్రామ సచివాలయం వద్ద టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి శనివారం టిడిపి నేతలు పాలాభిషేకం చేశారు. పార్టీ గ్రామ ప్రెసిడెంట్ యనమదల సిద్ధయ్య, వార్డ్ మెంబర్ యనమదల శ్రీనివాస్, టిడిపి నేత బెజవాడ శ్రీనివాసరావు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెజవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ చిత్రపటాన్ని చెత్తలో వేసినవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన పాఠశాల ఆదనపు తరగతి గదులను శనివారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపిటిసి సభ్యులు ఎం.నాగయ్య, జె.కోటయ్య, పార్టీ నేతలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన డిఎన్ఆర్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరు జట్ల మధ్య టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత పాల్గొన్నారు.

తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ, ఎంఎల్‌సి

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



ప్రోతాహక బహుమతులు అందిస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - భీమడోలు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల సేవలను వినియోగించుకోవాలని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. గ్రామపంచాయతీ పరిధిలోని నెంబర్ 1, 2, 3 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ, స్కూళ్ల యాజమాన్య కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశాలకు ముఖ్యఅతిథిగా సర్పంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. విద్యాపరంగా, ఇతర అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వ్యక్తిగతంగా ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ సందర్భంగా సర్పంచి హసేన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా పాఠశాలలకు నూతన భవనాల ఏర్పాటు చేయటం, కనీస సౌకర్యాల కల్పన, మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారం అందించడం, విద్యాదీవెన వంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. గ్రామ పరిధిలోని పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. దీనికి ప్రధాన కారణం సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు అంకితభావంతో మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉత్తమ స్థాయిలో బోధన చేయటం, ఇతర అంశాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు యాజమాన్య కమిటీ సభ్యులతో పాటు గ్రామ రెవెన్యూ అధికారి సింహాచలం, పంచాయతీ పాలకమండలి సభ్యులు అనంతమ్మ, గ్రామ సచివాలయాల సిబ్బందితో పాటు ఆయా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.తులసి శ్రీనివాస్, జి.భాస్కరరావు, మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 154 మంది హాజరు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంగా శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు టి.పుష్పావతి తెలిపారు. గతంలో భీమడోలు పరీక్షా కేంద్రంగా నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్షలకు భీమడోలు, ద్వారకా తిరుమల, దెందులూరు మండలాలకు చెందిన విద్యార్థులు మాత్రమే హాజరయ్యేవారన్నారు. తాజాగా నిర్వహించిన పరీక్షలకు వీటికి అదనంగా గణపవరం మండల విద్యార్థులు సైతం ఇక్కడికి వచ్చి పరీక్షలు రాశారన్నారు. పరీక్షా కేంద్రంలో 169 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా వీరిలో 154 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రం పరిశీలకులుగా పెదవేగి నవోదయ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు టి.సుధ వ్యవహరించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

ఘనంగా పశు వైద్య దినోత్సవం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ పశువైద్య దినోత్సవాన్ని జీలుగుమిల్లిలోని ప్రాంతీయ పశువైద్యశాలలో సహాయ సంచాలకులు ఎం.సాయిబుచ్చారావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలవరం సహాయ సంచాలకులు డాక్టర్.షరీఫ్, జంగారెడ్డిగూడెం సహాయ సంచాలకులు డాక్టర్ శేఖర్ దొర శ్రీనివాసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి బుచ్చారావు మాట్లాడుతూ ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనారోగ్యంగా ఉన్న పశువులకు అందించాల్సిన వైద్యం గురించి అవగాహన కల్పించారు. పశు వైద్య సిబ్బందికి యాంటీ ర్యాబిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన పశు వైద్య సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలు అందించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన పి.గణపతి శనివారం ఉదయం రూ.లక్ష విరాళం అందించారు. కైకలూరుకు చెందిన కొత్తపల్లి నాగధారలక్ష్మితేజ రూ.1,01,116 విరాళం ఆలయం ఎఇఒ మెట్టపల్లి దుర్గారావుకు అందించారు. అనంతరం దాతలు, వారి కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్స్ అందించారు.

రాత్రిసభలో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చింతలవల్లిలో జరిగిన రాత్రిసభలో సమస్యలు వెల్లువెత్తాయి. తహశీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత్రి సభలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు. గత ప్రభుత్వ సమయంలో నిర్మించిన గృహ నిర్మాణాలకు బిల్లులు కొందరికి ఇప్పటికీ రాలేదని, పిఎంఎవై ఇళ్ల బిల్లులు కూడా నేటికీ రాకపోవడంతో గ్రామస్తులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన మండల శాఖాధికారులతో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పి.సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి బిఎ.సత్యనారాయణ, సూపరింటెండెంట్ కూచిపూడి సాయిరామ్, ఆర్ఐ మాధీవి సాయిరామ్, సీనియర్ అసిస్టెంట్ డిఇబి చంద్రశేఖర్‌రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

2న రైతు కూలి సంఘం ఉమ్మడి జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మే రెండో తేదీన ఏలూరు షాదిఖానాలో జరిగే రైతు కూలి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్‌కె బాష శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత 75 సంవత్సరాలుగా పాలకులు తీసుకొచ్చిన పైరు పచ్చ, సస్య విప్లవాలు, నూతన ఆర్థిక సరళీకృత విధానాలు, ప్రపంచీకరణ-ప్రయివేటీకరణ-సరళీకరణ విధానాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేశాయన్నారు. రైతు ఏ పంట పండించినా గిట్టుబాటు కాక ఆత్మహత్య చేసుకోవాల్సిన దౌర్భాగ్య స్థితి దేశంలో నెలకొందన్నారు. ప్రభుత్వం చెప్పే లెక్కల ప్రకారమే ఐదు లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల రేట్లు విపరీతంగా పెంచి సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు రూ.లక్షల కోట్ల లాభాలను తమ దేశానికి తరలిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి ఇచ్చే అన్ని రకాల సబ్సిడీలను పాలకులు ఎత్తివేశారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసాన్ని కల్పించకుండా తీవ్రమైన జాప్యం చేస్తున్నారన్నారు. మే రెండో తేదీన జిల్లా మహాసభ సందర్భంగా పాత బస్టాండ్ నుంచి ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రారంభ ఉపన్యాసకులుగా రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, వక్తలుగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్.నాగరాజు, సహాయ కార్యదర్శి డి.వర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.వీరబాబు, ఎస్‌కె.బాష, పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో ప్రజా కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతు కూలీలు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.